'జనహిత'లో కాంగ్రెస్ శ్రేణులు



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో కలిసి పాదయాత్రలో పాల్గొన్న నాయకులు

రాజేంద్రనగర్: ప్రజల వద్దకు కాంగ్రెస్ సంక్షేమ పథకాలను తీసుకెళ్లేందుకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ చేపడుతున్న కాంగ్రెస్ జనహిత పాదయాత్రకు రాజేంద్రనగర్ డివిజన్ నుంచి పెద్ద ఎత్తున గురువారం నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు అంతా ర్యాలీగా అప్పా చౌరస్తాకు తరలివెళ్లారు. అక్కడి నుంచి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు.

రహదారులను బాగుచేయాలని వినతి

శంషాబాద్: పట్టణంలోని సహస్ర శ్రీనివాసా కాలనీలో రహదారులు అధ్వానంగా మారాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ మొత్తం మట్టిరోడ్లే ఉండటంతో వర్షాలకు గోతులమయంగా మారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కొంతకాలంగా మున్సిపాలిటీ అధికారులకు విన్నవించినా చర్యలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న సహస్ర శ్రీనివాసా కాలనీలో రహదారుల దుస్థితిలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. గోతులమయంగా మారిన రహదారులకు మరమ్మతులు చేయాలని, లేదంటే సీసీ రోడ్లు నిర్మించాలని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కోరుతున్నారు.

పరిశుభ్రతపై అవగాహన



మాట్లాడుతున్న బండ్లగూడ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని ఉపాధ్యాయులు తమ బాధ్యతగా తీసుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. డాన్ బాస్కో స్కూల్‌లో తడి, పొడి చెత్తపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తడి చెత్తతో కంపోస్టు ప్రక్రియ ద్వారా సేంద్రీయ ఎరువు తయారు చేసి మొక్కలకు వేయడం, పొడి చెత్త నూరి సైకిల్ చేసి రీయూస్ చేయడాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ విషయం ఇంట్లో తల్లిదండ్రులకు వివరించాలని వారికి తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ నాథన్, డైరెక్టర్ శరత్, జి.వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్టీపీని నిర్మించొద్దు



వినతిపత్రం అందజేస్తున్న కాలనీల ప్రజలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ గంధంగూడలో ఎస్టీపీని నిర్మించరాదని బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రావుకోళ్ల నాగరాజ్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డిలను కోరారు. ఈ మేరకు వారిని గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... కేకే నగర్, విఘ్నేశ్వర నగర్, బృందావన్ కాలనీ, రంగారెడ్డి కాలనీ, దత్తాత్రేయ కాలనీ ప్రతినిధులతో కలిసి సమస్యను వివరించామని తెలిపారు. ఎస్టీపీ సమస్యకు మద్దతుగా అండదండలు కావాలని కోరారు. కాలనీల ప్రతినిధుల సమస్యలు విని ఈ సమస్యకు సత్వర పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని, కాలనీ ప్రజలను ఇబ్బందులు గురి చేస్తే సహించేది లేదని వారు స్పష్టం చేశారు.

ఉద్యోగుల సేవలు చిరకాలం గుర్తుండాలి



శ్రావణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

ఏజీవర్సిటీ: ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఉద్యోగ విరమణ తప్పదని అయితే వారు అందించిన సేవలు చిరకాలం గుర్తుంచుకునేలా ఉండాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ కె.బి.ఈశ్వరి అన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రావణ కుమార్ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయం సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శ్రావణ కుమార్ మాట్లాడుతూ... తన ఉద్యోగ జీవితంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆశీస్సులు ఉన్నాయన్నారు.

అరకొరగానే వైద్య సేవలు!

- డాక్టర్లు, సిబ్బంది పోస్టుల ఖాళీ
- వైద్యుల నియామకంలో తీవ్ర జాప్యం
- చాలీచాలని సిబ్బందితో సేవలు
- రోగులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



నార్సింగి ప్రాథమిక కేంద్రం వద్ద వేచి ఉన్న రోగులు



డాక్టర్‌లేని మణికొండ బస్తీ దవాఖానా

మణికొండ: వేసవి తరువాత వాతావరణంలో మార్పు వచ్చింది. భారీ వర్షాలు కురుస్తున్నాయి. దాంతో ప్రజలు జలుబు, మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు, డెంగీ, మలేరియా, విరేచనాలు లాంటి జబ్బులతో బాధపడుతున్నారు. వారికి సకాలంలో వైద్య సేవలను అందించి ప్రజలను ఆదుకోవాల్సిన వైద్య శాఖ సిబ్బంది, డాక్టర్ల కొరతతో సతమతం అవుతోంది.

- గండిపేట మండల పరిధిలో 12 ప్రభుత్వ బస్తీ దవాఖానాలు ఉన్నాయి. వాటిల్లో నాలుగు బస్తీ దవాఖానాల్లో డాక్టర్లు, మరికొన్నింటిలో సిబ్బంది కొరతతో అంతంత మాత్రంగానే వైద్య సేవలు అందుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. డబ్బులు ఉన్న వారు ప్రైవేటు, ఆర్‌ఎంపీ డాక్టర్‌ల వద్ద సేవలు పొందుతున్నారు. అదే పేదలను ఆదుకునేందుకే ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాల్లో సకాలంలో సిబ్బంది, డాక్టర్‌లను భర్తీ చేయాల్సిన ఉన్నతాధికారులు చేష్టలుడిగి చూస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

వైద్యులు లేని దవాఖానాలు...

గండిపేట మండల పరిధిలో మొత్తం 12 బస్తీ దవాఖానాల్లో మణికొండ, కోకాపేట, బండ్లగూడల్లో వైద్యులు లేరు. గతంలో ఉన్న వారికి ప్రభుత్వ ఉద్యోగాలు రావటంతో వారు వెళ్లిపోయారు. వారి స్థానంలో ఇప్పటి వరకు కొత్త వారిని నియమించకపోవటంతో ఆ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

- నెక్నాంపూర్ బస్తీ దవాఖానాలో పనిచేస్తున్న డాక్టర్ శ్రీకాంత్‌ను డిప్యుటేషన్‌పై శేరిలింగంపల్లికి బదిలీ చేశారు. దాంతో అక్కడా తాత్కాలికంగా ఖాళీ ఏర్పడింది.
- దర్గాఖలీజ్ ఖాన్‌లో బస్తీ దవాఖానా ఏర్పాటు చేసినా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. దాంతో మండల పరిధిలోని పేదలకు అరకొరగానే అందుతుందనే విమర్శలు వస్తున్నాయి.
- నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన టీ హబ్ కేంద్రంలో రేడియాలజిస్ట్ పోస్ట్ నెలల తరబడి ఖాళీగా ఉండటంతో అల్ట్రాసౌండ్ తదితర సేవలను నిర్వహించలేకపోతున్నారు.
- ఇకనైనా వైద్య శాఖ ఉన్నతాధికారులు, మంత్రి స్పందించి అత్యధిక ప్రజలు నివసించే గండిపేట మండల పరిధిలోని అన్ని బస్తీ దవాఖానాల్లో సిబ్బందిని, డాక్టర్‌లను నియమించి పూర్తి స్థాయి సేవలను అందించాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపాలిటీలతో సంయుక్తంగా...

గండిపేట మండల పరిధిలో రోగాలు ప్రబలే అవకాశం ఉన్న చోట్లను గుర్తించి మున్సిపాలిటీలతో కలిసి వైద్య అధికారులు పనిచేస్తున్నారు. రోజూ ఉదయం ఆశా వర్కర్‌లు, ఏఎన్‌ఎంలు గ్రామాల్లో పర్యటించి రోడ్ల పక్కన చెత్త, మురికి ఉన్న చోట్లను గుర్తించి వెంటనే మున్సిపల్ అధికారులకు ఫొటోలు తీసి పెడుతున్నారు. మున్సిపాలిటీల సిబ్బంది వెంటనే స్పందించి చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లి నివారణ చర్యలు చేపడుతున్నారు. వైద్య సిబ్బంది కాలనీల వారీగా పర్యటిస్తూ వర్షాకాలంలో వచ్చే రోగాలను నివారించేందుకు తాగునీటిని వేడి చేసుకుని వాడాలని, వేడి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని, పరిశుభ్రతను పాటించాలని, దోమలు, ఈగలు లేకుండా చూసుకోవాలనే జాగ్రత్తలను వివరిస్తున్నారు.

ప్రజలు ఇబ్బంది పడకుండా...



గండిపేట మండల పరిధిలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, లేబర్ క్యాంప్‌లు, పేద ప్రజలు నివసించే బస్తీలలో తమ సిబ్బంది రోజూ వెళ్లి అనారోగ్యంతో ఉన్న వారికి పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేస్తున్నాం. వారికి వర్షాకాలంలో వచ్చే రోగాలపై అవగాహన కల్పించటంతో పాటు నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నాం. నలుగురు డాక్టర్‌లు తక్కువగా ఉన్న విషయం వాస్తవమే. వారిని భర్తీ చేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నాం. వారు వచ్చే వరకు సర్దుకుని ప్రజలు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ సత్యరత్న, గండిపేట మండల వైద్యాధికారి

శంషాబాద్ ఆస్పత్రికి కొత్త భవనం

- త్వరలో ప్రారంభంకానున్న నిర్మాణ పనులు
- 50 పడకలతో.. జీప్లస్‌టూగా నిర్మాణం



శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని ప్రభుత్వ దవాఖానాకు అత్యాధునిక హంగులతో కూడిన సొంత భవనం త్వరలోనే ప్రారంభం కానుంది. ఆస్పత్రి స్థాయికి అనుగుణమైన భవనం లేకపోవడంతో దశాబ్దకాలంగా పడుతున్న ఇబ్బందులకు తెరపడనుంది. అన్ని రకాల అనుమతులు మంజూరైన అనంతరం హెచ్‌ఎండీఏ నిధులతో త్వరలోనే పనులు ప్రారంభించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు.

ఎన్నో ఇబ్బందులు...

పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో నిత్యం 200 వరకు ఔట్ పేషెంట్లు వైద్య సేవలు పొందుతున్నారు. దీంతోపాటు గర్భిణుల ప్రసవాలకు తగు ఏర్పాటు వసతులతోపాటు డయాలసిస్ కేంద్రం ఇక్కడ అందుబాటులో ఉంది. రోగుల తాకిడికి అనుగుణంగా సరైన వసతులు లేక వైద్యులతో పాటు రోగులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల కిందటే ప్రభుత్వ దవాఖానా స్థాయి, సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు హెచ్‌ఎండీఏ నుంచి దీనికి సంబంధించిన నిధులను కేటాయించినా పనులు ప్రారంభం కాలేదు.

హెచ్‌ఎండీఏ నిధులతో...

పెరుగుతున్న రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వ దవాఖానా స్థాయిని పెంచేందుకు ఇటీవల అధికారులు చర్యలు ముమ్మరం చేసి వైద్య శాఖ సూచనల మేరకు డీపీఆర్‌ను రూపొందించారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం రూ. 5.7 కోట్ల నిధులతో జీ ప్లస్ టూగా 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి టెండర్లకు కూడా అధికారులు విడుదల చేశారు. మరో ఇరవై రోజుల్లో ఆస్పత్రి నిర్మాణ పనులు కూడా ప్రారంభించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు జరగనున్నాయి. దీంతో దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించనుంది.

నేడు భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ వ్యవస్థాపక దినోత్సవం



భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ

ఏజీవర్సిటీ: భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) వారి భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ 49వ వ్యవస్థాపక దినోత్సవం రాజేంద్రనగర్‌లోని ఐఐఓఆర్‌లో శుక్రవారం నిర్వహించనున్నారు. భారతీయ నూనె గింజల సంస్థ మూడు దశాబ్దాలుగా జీవ నియంత్రణ సాంకేతిక రంగంలో వివిధ ట్రైకోడెర్మ, బి.టి సంబంధిత ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో దేశ వ్యాప్తంగా ఘనత సాధించింది. ఈ సాంకేతికను దేశ వ్యాప్తంగా 60 కన్నా ఎక్కువ పరిశ్రమలకు అందించడం జరిగింది. ముఖ్యంగా ఈ సంస్థ నూనె గింజల పంటల్లో కొత్త వంగడాలు, నూతన ఆవిష్కరణలు, జీవ ఆధారిత యాజమాన్య పద్ధతులు, కొత్త బయో ఫర్టిలైజర్స్, విత్తన శుద్ధి అవసర బయోపాలిమర్ వంటి ఆవిష్కరణలపై అవగాహన కల్పిస్తుంది. నూనె గింజల రైతుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. వారికి నూనె గింజల పంటలపై నూతన పద్ధతులపై శిక్షణ ఇవ్వడం ఈ రైతులను ప్రోత్సహించేలా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా ఈ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఈ సంస్థలో విశేష ప్రతిభ కనబరిచిన సైంటిస్ట్‌లకు, టెక్నికల్, అడ్మినిస్టేట్ విభాగం ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలు అందించనున్నారు. నూనె గింజల సాగులో నూతన ఆవిష్కరణలను అందిపుచ్చుకుని అధునిక సాగు పద్ధతుల్లో ప్రతిభ చూపిన రైతు సోదరులకు సన్మాన కార్యక్రమం చేయనున్నారు. కార్యక్రమంలో ఐసీఏఆర్, ఐఐఓఆర్, ప్రతినిధులు, వివిధ విశ్వవిద్యాలయాల వీసీలు, డైరెక్టర్లు పాల్గొననున్నారు.

సీసీ కెమెరాలకు మరమ్మతు చేయించండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నేతలు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల భద్రత కోసం రూ. 1.20 కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఎక్కువ శాతం పనిచేయటం లేదని, వాటికి వెంటనే మరమ్మతులు చేయించాలని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ నాయకులు, బీజేపీ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి కె.శివరాంరెడ్డి కోరారు. ఈ మేరకు వారు వేరువేరుగా మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ యువత అధ్యక్షుడు ఎస్.శ్రీకాంత్, ప్రచార కార్యదర్శి ఎ.లక్ష్మణ్‌రావు, బీజేపీ ప్రధాన కార్యదర్శి శివరాంరెడ్డి మాట్లాడుతూ... ఇటీవల శ్రీరాంనగర్ కాలనీలో ఆటో ప్రమాదం, పైప్‌లైన్ రోడ్డులో నీటి ట్యాంకర్ ప్రమాదాలు జరిగినా మున్సిపాలిటీ నుంచి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలలో రికార్డు కాలేదన్నారు. ఆయా సంఘటనల్లో ఎవరి తప్పు అని తెలుసుకునేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చిందన్నారు. ఇకనైనా సీసీ కెమెరాలు సరిగా పనిచేసేలా మరమ్మతులు చేయించాలని కమిషనర్‌ను కోరామన్నారు. నాయకులు కె.ప్రవీణ్, తిరుపతి, కిరణ్, బాబు రావు, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి సన్మానం



పదవీ విరమణ చేసిన సిబ్బందిని సన్మానిస్తున్న ఆర్టీసీ డీఎం కృష్ణారెడ్డి

రాజేంద్రనగర్: ప్రజలకు నేరుగా సేవ చేసే అవకాశం ఆర్టీసీలో ఉంటుందని టీజీఎస్ ఆర్టీసీ రాజేంద్రనగర్ డిపో మేనేజర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం డిపోకు చెందిన డ్రైవర్ మహ్మద్ ఫరీద్, హెల్పర్ మీర్జా యూసుఫ్, కండక్టర్ ప్రకాశ్‌ల ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. డిపో ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పదవీ విరమణ సిబ్బందిని ఘనంగా సన్మానించి ఆర్టీసీ డిపో తరపున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దేశంలో అతి పెద్ద రవాణా సంస్థ అయిన తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీలో పని చేయడం గర్వకారణమన్నారు. ప్రజలతో నేరుగా సంబంధాలు ఉన్న ఏకైక సంస్థ ఆర్టీసీ అని అందులో ప్రజలకు సేవ చేయడం మనందరి అదృష్టమన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులంతా తమ శేష జీవితాన్ని ఆయురారోగ్యంతో కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.

మైనర్ డ్రైవర్లపై కొరడా

- ముగ్గురి వాహనాలు సీజ్
- తల్లిదండ్రులపై కేసుల నమోదు
- సరైన పత్రాలు లేని మరో రెండు వాహనాలు సీజ్




పుప్పాలగూడ బీఆర్‌సీ వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మణికొండ: డ్రైవింగ్ చేసే అర్హత, వయసు లేకుండా ద్విచక్ర వాహనాలను నడుపుతున్న ముగ్గురి వాహనాలను సీజ్ చేశారు. జరిమానాలు విధించటంతో పాటు వారి తల్లిదండ్రులపై నార్సింగి ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. నార్సింగి ట్రాఫిక్ ఎస్ఐలు ఎ.రాజేశ్‌గౌడ్, కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పుప్పాలగూడ బీఆర్‌సీ అపార్ట్‌మెంట్ వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ క్రమంలో అటుగా వాహనాలు నడుపుతూ వచ్చిన ముగ్గురు మైనర్లతో పాటు మరో ఇద్దరు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే వాహనాలు నడుపుతూ వారికి చిక్కారు. దాంతో వారికీ జరిమానాలు విధించటంతో పాటు వారి వాహనాలను సీజ్ చేశారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపైనా మోటారు వాహన చట్టం ప్రకారం కేసులు నమోదు చేశారు. ప్రతి ఒక్కరూ తమ మైనర్ పిల్లలకు వాహనాలను ఇవ్వవద్దని, వాహనాల సరైన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు ఉన్న వారు మాత్రమే వాహనాలను నడపాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

అత్తాపూర్: ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని పీఆర్‌టీయూటీఎస్ రాజేంద్రనగర్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సుదర్శన్, శ్రీనివాస్‌సాగర్, గౌరవ అధ్యక్షుడు మాణిక్‌రెడ్డి అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్‌లో తీర్మానించిన మేరకు పెండింగ్ బిల్లులు రూ. 1217 కోట్లను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను వెంటనే అమలు చేయాలని, ఈహెచ్ఎస్ నూతన నిబంధనలను ఆగస్టు మొదటి వారం నుంచి అమలు చేయాలని అన్నారు. 317 జీవో వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు లాంగ్ డిప్యుటేషన్ ఇవ్వాలని కోరారు. సీపీఎస్ రద్దు ప్రభుత్వ మేనిఫెస్టో ప్రకారం అమలు చేయాలన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ జరిగే సీపీఎస్ ధర్నాలో వేలాదిగా ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



నివాళులర్పిస్తున్న యోగా సాధకులు

ప్రకాశ్‌లాల్‌కు ఘనంగా నివాళి

మణికొండ: భారతీయ యోగా సంస్థాన్ వ్యవస్థాపకుడు ప్రకాశ్‌లాల్ 16వ వర్ధంతిని పురస్కరించుకుని మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్, నేతాజీపార్క్‌లో గురువారం ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు మంజు అగర్వాల్ మాట్లాడుతూ... లక్షలాది మందికి యోగాను నేర్పించి వారి ఆరోగ్యాలను పరిరక్షించాలనే ఉద్దేశంతో ఆయన యోగా సాధనను మొదలు పెట్టారన్నారు. జీవించు, జీవంపచేయి అనే నినాదంతో మొదలు పెట్టిన సంస్థ ప్రస్తుతం 4 వేల మంది సాధక్‌లతో సేవా భావంతో దేశ వ్యాప్తంగా ప్రజలకు ఉచితంగా యోగా నేర్పుతుందన్నారు. కార్యక్రమంలో యోగా టీచర్ సుగుణ, సాధకులు పాల్గొన్నారు.

చెత్తను స్వచ్ఛ ఆటోల్లోనే వేయాలి

బండ్లగూడ: ప్రజలు తమ ఇంట్లోని చెత్తను ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటో కార్మికులకు మాత్రమే అందజేయాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. 4వ డివిజన్‌లోని శ్రీరాంనగర్ కాలనీలో తడి, పొడి చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ మధుసూదన్, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ సెల్ ఏర్పాటు భేష్

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీసీ ఉద్యోగులు, విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని బీసీ సెల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె. పవన్ చంద్రారెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్ జానయ్యకు తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ సంఘం ఏర్పాటుకు సహకరించిన విశ్వవిద్యాలయం టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టాసా సంఘం నాయకులు ప్రధాన కార్యదర్శి, సల్లా సౌజన్య, ఉపాధ్యక్షుడు డాక్టర్ జె.కమలాకర్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ పి.రమేష్, పి.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతు



పనులను పరిశీలిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

రాజేంద్రనగర్: వర్షం కారణంగా గోతులమయంగా మారిన రోడ్లపై ప్యాచ్ వర్క్‌ను పూర్తిస్థాయిలో నిర్వహించేందుకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌తో పాటు జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి పనులను చేపడుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని ఉప్పర్‌పల్లిలో నిర్వహిస్తున్న ప్యాచ్‌వర్క్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గత వారం కురిసిన వర్షాలకు ప్రధాన రహదారులతో పాటు అంతర్గత బస్తీలలో రోడ్లు గుంతలమయంగా మారాయన్నారు. దీని కారణంగా వాహనదారులతో పాటు పాదచారులు, స్థానిక వ్యాపారస్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో పాటు జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా తక్షణ ప్యాచ్ వర్క్ పనులను నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన జీహెచ్‌ఎంసీ అధికారులు ప్యాచ్‌వర్క్ పనులను చేపతుండటం అభినందనీయమన్నారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా తాము ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో మాట్లాడి పనులను నిర్వహిస్తున్నామన్నారు.

మద్యం సేవిస్తూ కుప్పకూలి వ్యక్తి మృతి



సాయిలు మృతదేహం

శంషాబాద్: కవేలిగూడలోని ఓ వైన్స్‌లో మద్యం సేవిస్తున్న ఓ వ్యక్తి ఒక్కసారిగా కుప్పకూలి మరణించిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తూరు మండలం అక్కినేని గూడ గ్రామానికి చెందిన సోలిపురం సాయిలు(48) కవేలిగూడ వైన్స్‌లోని వెనుక భాగంలో ఉన్న సిట్టింగ్ ఏరియాలో కూర్చుని మద్యం సేవిస్తూ ఒక్కసారిగా వెనక్కిపడిపోయాడు. పక్కనే ఉన్న కొందరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికొచ్చి పరిశీలించగా అప్పటికే ఆయన మరణించాడు. ఈ మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలానికి వచ్చిన మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు కల్తీ మద్యం కారణంగా సాయిలు మృతి చెందాడని ఆరోపిస్తున్నారు.

క్రీడలతో పరిపూర్ణ ఆరోగ్యం



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

మణికొండ: నిత్యం ప్రజల సమస్యల పరిష్కారానికి, వారికి సకాలంలో సేవలు అందించేందుకు కృషి చేసే మున్సిపల్ సిబ్బంది అప్పుడప్పుడు క్రీడలు ఆడితే వారికి మానసికోల్లాసంతోపాటు పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీలో పని చేస్తున్న సిబ్బంది నాలుగు జట్లుగా విడిపోయి వట్టినాగులపల్లిలోని అర్బన్ క్రికెట్ గ్రౌండ్‌లో పోటీపడ్డారు. క్రికెట్ పోటీలను కమిషనర్ ప్రారంభించటంతో పాటు విన్నర్, రన్నర్ జట్లకు కప్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వంద రోజుల ప్రణాళికలతో భాగంగా మున్సిపల్ సిబ్బందికి ఆటల పోటీలను నిర్వహించామన్నారు. ఫైనల్‌లో మేనేజర్ నాగేంద్రబాబు, డీఈ నరేష్‌కుమార్ టీములు పోటీ పడగా అందులో మేనేజర్ టీం విజేతగా నిలవగా డీఈ టీం రన్నర్‌గా నిలిచింది. వారికి కప్‌లను కమిషనర్ అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.